# కళ్లజోడు

-కె.తాయారమ్మ

"బాబూ దత్తాత్రేయులూ నాకో కళ్లజోడు కొని పెట్టవూ!" బొత్తిగా చూపు ఆనడం లేదు! బియ్యంలో రాళ్లేరాలన్నా, ఏ పురాణమో, పుణ్యకథో చదవాలన్నా కుదరడం లేదు!"

కొడుకు దత్తాత్రేయుల దగ్గర మొరపెట్టుకుంది విజయమ్మ.

స్కూల్ యూనిట్ పేపర్లు దిద్దుతున్న దత్తాత్రేయులు తల్లి ముఖంలోకి ఓసారి చూసి "అలాగేలే అమ్మా, రేపటి నెలలో ప్రయత్నిస్తాను!" అన్నాడు.

"నిన్నటి వరకూ మీ నాన్నగారి కళ్లజోడుతోనే సరిపెట్టుకున్నాను! అది కాస్తా కాలి కిందపడి పగిలింది!"

"ఎవరి కాలి కింద?"

"నా కాలి కిందే! ఏమంటారూ? నేను కన్ను చాటయితే చాలు! ఏవో నేరాలు చెప్పడం, లేనివీ వున్నవీ నూరి పొయ్యడం, ఈవిడగారికి కళ్లజోడు లేకపోతేనేం?" అంటూ రుసరుసలాడింది కోడలు కమల కొళాయి నుంచి నీళ్ల బిందె తెస్తూ!

"నువ్వు కళ్లజోడు పగలగొట్టావని నేను చెప్పలేదు కమలా! నాకో... ఇంకా ఏదో అనబోయేంతలో

"చాల్లెండి నోర్మూయ్యండి! ఇంట్లో తిండి గింజలకే ఇబ్బంది పడుతుంటే, మీకు కళ్లజోడు కావల్సొచ్చిందా? ఏ పరీక్షల కన్నా ప్రిపేరవ్వాలా? చచ్చినట్లు ఓ మూల వుండండి!"

గుడ్ల నీరు కుక్కుకుంది విజయమ్మ.

కొడుకు దత్తాత్రేయులు ఓసారి తల్లివైపు చూసి తరువాత బాత్‌రూమ్‌లో కెళ్లి తలుపు మూసుకున్నాడు.

వాళ్ల ఉద్యోగాలకి టైములవుతున్నాయి.

మళ్లీ ఏ రాత్రికో ఇల్లు చేరుతారు.

కొడుకుని నిందించి ప్రయోజనం లేదు. కోడల్ని ఆడిపోసుకోవడం అనవసరం.

ఇది మధ్య తరగతి మందహాసం.

పిల్లలిద్దర్నీ రెండు బాది వాళ్లని క్షణాలల్లో తయారు చేసింది కమల.

వాళ్లు టిఫెన్ బాక్సులు పట్టుకుని రిక్షా ఎక్కారు.

"చిన్ని, చంటి జాగ్రత్త!" హెచ్చరించి వెనుదిరిగింది కమల.

ఆమె కోపం ఎదురుగా వున్న విజయమ్మ మీద పడింది. "గుర్రం గుడ్డిదయినా దాణాకేం లోటు లేదు!" అంటూ ఓ విసురు విసిరి లోపలికి నడిచింది.

కళ్ల నించి చివ్వున నీరు చిమ్మింది. నిజమే తనలాంటి వాళ్లని పోషించడం కష్టం, తాను వ్యర్థ జీవి.

"భర్తతో పాటే తనూ పోయుంటే ఎంతో బాగుండేది!"

అంతలోనే నవ్వొచ్చింది విజయమ్మకి. పుట్టిన వాళ్లందరూ ఒకేసారి పోతే ఈ ప్రపంచం సంగతి

## కుక్కచావు

ఒళ్లు తెలియని వేగంతో వస్తున్న లారీ
కళ్లముందే కదిలిపోతున్న కుక్కపాలిట
మృత్యుశకటమైంది
లారీ చక్రాలు తొక్కేయడంతో
రెప్పపాటుతో కుక్కప్రాణం
గాలిలో కలిసిపోయింది
ఒక నిర్లక్ష్యానికి
ఒక నిండు ప్రాణం బలి అయింది
వెళ్ళుకొచ్చిన పేగులు
చితికిపోయిన తల
ముక్కలైన ఎముకలు
ఓడుతున్న నెత్తురు
కళ్లముందు భయానక దృశ్యం
కడుపులో దేవినట్లయింది
గుండెలు పిండినట్లయింది
నిర్వేదం హృదయాన్ని కప్పివేసింది
వేదనతో గుండె బరువెక్కింది
వెనక్కి రాని కాలం
ముందుకు సాగిపోతూనే వుంది
ఇప్పటికీ అప్పుడప్పుడు
కుక్కచావు గుర్తుకొచ్చినప్పుడు
వేదన పురి విప్పుతుంటుంది
గుండెలయ తప్పుతుంటుంది.

-జి.నీలకంఠం

ఏమిటి?

రానురాను మానవతా సంబంధాలు కొరవడు తున్నాయా?

కొడుకు కోడలూ ఇద్దరూ బయలుదేరారు రెండు మెతుకులు కతికి.

వాళ్లిద్దరూ ఏవో ప్రైవేట్ స్కూళ్లోనే ఉద్యోగాలు చేస్తున్నారు. చాలీచాలని జీతాలు. రాత్రి ఏడు ఎనిమిది గంటల వరకు ప్రైవేట్లు చెప్పుకుని, ఇంటికి తిరిగి వస్తారు.

మళ్లీ రుసరుసలు, విసవిసలు ప్రారంభం.

మనుమలిద్దరు సాయంత్రం ఇంటికొచ్చి వాళ్లమ్మ ఫ్లాస్కులో పోసివుంచిన పాలుతాగి ట్యూషన్‌కి వాళ్లు పోతారు.

"ట్యూషన్ కాదు. ఇదొక ఫ్యాషన్!" అంటారు పక్కవాటా పరాశరం గారు.

తనూ నవ్వుతుంది.

ఎడారిలో ఒయాసిస్సులాంటిది ఆయన మాట. భగవంతుడు అందరినీ ఒకేలా సృజించడు.

" ఆయన మానవతా వాది!"

ఆయన దగ్గర కొద్దిసేపు కూచుంటే అంత వరకు పడిన మనో క్లేశమంతా క్షణాలలో మాయమవుతుంది.

హృదయం ప్రశాంతతను సంతరించుకుంటుంది.

విజయమ్మ తరచూ అక్కడికి పోయి మాట్లాడి వస్తూ వుంటుంది.

అది రెండు వాటాల ఇల్లు. తాము ఆ ఇంట్లో దిగి సంవత్సరం దాటింది.

ఆరు నెలల క్రితం పరాశరంగారు పక్క వాటాలో వచ్చి చేరారు.

ఆయనదో విచిత్రమైన కేసు. భార్య విడాకులిచ్చిందిట! బిడ్డలు దూరంగా వున్నారు. గవర్నమెంటు ఉద్యోగం చేసి పదేళ్ల క్రితం రిటైరయ్యేరట! పెన్షన్ వస్తుంది. ఎవరి ప్రమేయం లేకుండా హాయిగా జీవితం గడపాలన్నదే ఆయన ధ్యేయమట!"

ఎవరో అనుకుంటూ వుంటే వింది.

ఎవరి అంతరంగాలు వారివి!

కొడుకు కోడలూ అలా వెళ్లేక పక్క వాటావైపు వెళ్తుంది విజయమ్మ.

అప్పటికే భోజనం ముగించి న్యూస్ పేపరు పట్టుకు కూచుంటారు పరాశరం గారు.

"రండి విజయమ్మగారూ!" అంటూ సాదరంగా ఆహ్వానిస్తారు పరాశరం గారు.

ఇద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటారు. ఆయన పేపరు వార్తలన్నీ చదివి చెప్తారు.

ఆవిడ అన్నీ చక్కగా వింటుంది.

మండుతున్న ధరవరలు, చాలీచాలని డబ్బు, కొడుకూ కోడలు పడుతున్న కష్టం అన్నీ ఏకరువు పెడుతుందామె.

పరాశరం గారికి అన్ని పనులూ చేసి పెట్టడానికి కుందు అన్న పద్నాలుగేళ్ల కుర్రాడున్నాడు.

వాడు ఎప్పుడూ నవ్వుతూ వుంటాడు.

వాడి తిండి గుడ్డ అన్నీ పరాశరంగారే చూస్తారుట.

విజయమ్మ, పరాశరంగార్లు ఆత్మ బంధువులు. కష్ట సుఖాలు కలబోసుకుంటారు. "కన్న బిడ్డలకే భారమైన బతుకు ఓ బతుకేనా?" అంటూ ఆవిడ కన్నీరు పెట్టుకుంటే, మానవతా విలువలు నశించాయంటా రాయన.

ఇది విజయమ్మగారి దినచర్య. ఆమె చరమాంకంలో దొరికిన మంచినేస్తం పరాశరం గారు.

ఒకసారి పరాశరం గారు ఏదో పనిమీద లోపలి కెళ్లినప్పుడు ఆయన కళ్లజోడు పెట్టుకు చూసింది.

పరిసరాలన్నీ చక్కగా కనిపిపించాయి. అది ఐదువందల రూపాయిలయ్యిందిట!

కుందు చెప్పాడు.

తనదీ ఆయనదీ ఒకే పవరు అయ్యుంటుంది.

తనకీ ఓ కళ్ల జోడుంటే ఎంత బావుణ్ణు! చక్కగా భగవద్గీత, విష్ణు సహ్రస నామం చదువుకోవచ్చు! వంటా వార్పు చెయ్యచ్చు!

"కోడలు తనని వండనివ్వదు. అన్నీ ఎక్కువెక్కువ పోసేస్తుందని ఆమెకి అనుమానం.

రెండు మెతుకులు టేబుల్ మీద్ధ పడేసి పోతుంది.

ఆరోజు కూడా రెండు మెతుకులు కతికి, ఇల్లు సవరించుకుని పక్క వాటాలో కొచ్చింది విజయమ్మ.

"రండి విజయమ్మ గారూ! ఈ రోజు పేపరు వార్త విన్నారా? తల్లి తండ్రులిద్దర్నీ చంపిన కొడుకు ఉదంతం! ఎంత బావుందో చూశారా?"

వేదాంతిలా నవ్వింది విజయమ్మ.

"రోజూ తల్లిదండ్రుల్ని వేధించే బదులు ఇదే నయం కదూ?"

"ఐతే మీరు హింసను ప్రోత్సహిస్తున్నారా?"

"వద్దండీ వద్దు! వాళ్లకి మన మీద ప్రేమాభి మానాలూ, గౌరవాదరాలు లేక కాదు! వాటిని ప్రక టించుకోడానికి తగిన సమయం లేక, తాహుతు లేక!

అంతే!"

"ఇవాళ మీ కొడుకు మీకు కళ్లజోడు కొని పెట్టలేదన్న కోపం మీలో నిబిడీ కృతమై వుంది. కాని అతగాడి పరిస్థితి మీకు అవగతం కాలేదు! దినసరి వెచ్చాలు గడవడమే కష్టంగా వున్న ఈ తరుణంలో మీ కొడుకు మీకు కళ్లజోడు కొని పెట్ట గలడా? అలాగని అవసరాలు మానుకోవడమూ కష్టమే!"

క్షణకాలం ఆగారు పరాశరం గారు.

స్థాణువులా నిలుచుండి పోయింది విజయమ్మ.

ఉదయం తమ ఇంట్లో జరిగిన సంగతంతా విన్నారాయన. ఈ ఇంటి మాటలు ఆ ఇంట్లోకి, ఆ ఇంటి మాటలు ఈ ఇంట్లోకి స్పష్టంగా వినిపిస్తాయి.

ఆ ఇంట్లో మాటలేముంటాయి? కుందుతో మాట్లాడే ఒకటి రెండు మాటలు తప్ప.

కుందు ఇద్దరికీ టీలు తెచ్చాడు. "తీసుకోండి విజయమ్మ గారూ!" అని, "నా మాటలు మిమ్మల్ని బాధించాయా? నా మట్టుకు నన్నే చూడండి! నేను ఎంతో సుఖంగా వున్నాననుకుంటారు అందరూ. కాని... కాని... నాలో దాగివున్న అగ్ని పర్వతాలే ఎవరికీ కనిపించవు!".

ఆశ్చర్యంగా ఆయనవైపు చూసింది విజమయ్మ.

నా మొదటి భార్య సీత ఇద్దరు మొగబిడ్డల్ని ప్రసాదించి ఎవరికీ అందనంత దూరం వెళ్లిపోయింది. బంధువుల బలవంతం మీద రెండో పెళ్లి చేసుకున్నాను! కాని ఆమె ప్రేమించిన వాడికోసం విడాకులిచ్చి పోయింది.

చిన్నగా ఊపిరి తీసుకున్నారాయన.

బిడ్డలిద్దర్నీ పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేసి వాళ్లని సంఘంలో ఓ ఉన్నత స్థానంలో నిలబెట్టాను!

కాని... కాని... ఇప్పుడు నేనే వాళ్లకి బరువుగా మారాను! అందుకే... అందుకే.. ఇలా జీవితంలోంచి పారిపోయి వచ్చి ఇక్కడ తలదాచుకుంటున్నాను! కాని నాకు ఒక్కటి అనిపిస్తూ వుంటుంది! నేనే కొంచెం సర్దుకు పోయి వుంటే బావుండేదేమో! అని.

"మన బిడ్డలు మనల్ని ఒకమాట అంటే బాదెందుకు?" మన కాలంలో మనకుండే ప్రశాంతత ఇప్పటి వాళ్లకేదీ?"

జీవిత సత్యమేదో గోచరమయినట్లు అనిపించింది విజయమ్మకి.

"ఇంక వెళ్లొస్తాను పరాశరం గారూ!" అంటూ ఇంట్లోకి నడిచింది.

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో వచ్చారు కొడుకూ కోడలు ఉస్సురని నిట్టూరుస్తూ.

గుండె దేవినట్లయ్యింది విజయమ్మకి.

శరీరానికి శ్రమ ఎక్కువయితేనే వస్తాయి చిరాకులు, పరాకులు.

ఆ రాత్రి విజయమ్మకి నిద్ర పడుతున్న తరుణంలో వినిపించాయా మాటలు, "కమలా, రేపు నెలలోనైనా అమ్మకి కళ్లజోడు కొనాలి!" అంటున్నాడు దత్తాత్రేయులు.

"నాకు మాత్రం ఇష్టం లేదుటండీ!" కాని రేపు నెలలో చంటి, చిన్నిలకి స్కూలు ఫీజులు కట్టాలి! గొర్రె తోక బెత్తెడే! అన్న సామెత మనది!" అంటూ నిద్రలోకి జారుకున్నట్లున్నది కమల.

ఆ రాత్రి ఎన్నో ఆలోచనలతో గడిచింది విజయమ్మకి.

విజయమ్మ దినచర్య మామూలుగానే సాగుతోంది. పరాశరంగారి దగ్గర కూర్చోడం, ఆయన చెప్పే పేపరు వార్తలు, లోకాభిరామాయణం వినడం అన్నీ చేస్తోంది.

అప్పుడప్పుడు ఆయన చూడకుండా ఆయన కళ్ల

## విస్తరిస్తున్న 'భాగ్య' నగరం

అస్తమానం అధిక జనసందోహంతో
విస్తరిస్తోంది భాగ్యనగరం!
భాగ్యాన్ని వెదుక్కుంటూ వచ్చే అభాగ్యులూ
భోగభాగ్యాలతో తులతూగే సౌభాగ్యులూ
'భాగ్య' నగరాన్నే కోరుకుంటారు.
పరిమళిస్తున్న వివిధ జాతుల పుష్పాలు
పరిభ్రమిస్తున్న బహుభాషా భ్రమరాలు
పరిఢవిల్లే ఉద్యానవనమిది!
ఇక్కడ కవికోకిలలు రాగాలు పలుకుతుంటాయి
ఎక్కడ చూచినా స్నేహశారికలు అనురాగాలు
చిలుకుతుంటాయి
కళ్లు చెదిరే అందాలూ, కమనీయ విద్యాగంధాలూ
కావలసినన్ని లభిస్తాయి ఇక్కడ!
వామనుడు త్రివిక్రముడైనట్లే
వాసినీ, రాసినీ పెంచుకొంటూ పోతున్న నగర
దేవత
భవిష్యత్తులో ఏ విశ్వరూపాన్ని దిద్దుకుంటుందో?
భావితరాలను తనలో ఎలా అద్దుకుంటుందో?

**–డా॥ అయాచితం నటేశ్వరశర్మ**

జోడు పెట్టుకుని వీధిలో దూరంగా కనిపిస్తున్న సినిమా వాల్ పోస్టర్లు అవీ చదువుతోంది. ఇలా ఎన్నాళ్లు?

రోజులు దొర్లుతున్నాయి.

ఇంతలో కూతురు అత్తగారు పోయినట్లు కబురొచ్చింది.

"వియ్యపు జీడి అంటుకుంటుంది నేను వెళ్లను!" అంది విజయమ్మ

"ఫరవాలేదు, మీరేం బాలా కుమార్తె కాదుగా వెళ్లిరండి!" అంటూ పంపించింది కోడలు కమల.

తప్పనిసరై బయలుదేరింది విజయమ్మ. అప్పుడు పరాశరం గారు ఇంట్లో లేరు. ఆయనతో చెప్పడానికి కుదరలేదు.

"పోనీలే పది రోజులలో తిరిగి వచ్చేస్తాందిగా!" అనుకుంటూ కూతురింటికి బయలు దేరింది.

వెళ్తానే కూతుర్నీ, అల్లుణ్నీ పలకరించింది. ఎవరో అన్నారు "విజయమ్మ గారూ మీరు రాకూడదు కద! ఎందుకొచ్చారు?" అంటూ.

"మా అమ్మ ఏమైనా చిన్న పిల్లా? వయస్సుడిగిందిగా! వస్తేనేం?" అంది కూతురు రమ.

మరోసారి వేదాంతిలా నవ్వుకుంది విజయమ్మ.

సర్దుబాటు తత్వం వుండాలన్నారు పరాశరంగారు.

చుట్టాలు, బంధువులతో పది రోజులూ పది క్షణాలలా గడిచి పోయాయి.

"పెద్ద వాళ్ల చావు పెళ్లితో సమానం!" అంటారు.

ఇంక వుండకూడదంటూ పద్నాల్గవనాడు తనూరికి ప్రయాణమయ్యింది విజ యమ్మ.

బొత్తిగా చూపు ఆనడం లేదు. కూతురి దగ్గర కూడా కళ్ల జోడు ప్రసక్తి తెచ్చింది. "ఇలాంటి సమయంలో ఎలా కుదురుతుందమ్మా! ఇప్పటికే బోలెడు డబ్బు అయింది. ఏ మొహం పెట్టుకుని అడుగుతాను ఆయన్ని!" తప్పించుకుంది కూతురు.

తిరిగి వచ్చింది. మళ్లీ రొటీన్ జీవితం. పక్కవాటాలో అలికిడి లేదు. వెళ్లి చూసింది. తాళం పెట్టి వుంది.

"పరాశరంగారు ఏరి?" పని మనిషి కనకాన్ని అడిగింది. "మీకు తెలవదా అమ్మగారూ? ఆ బాబు గుండెపోటు వచ్చిపోనారు!" అంది.

హతాశురాలైంది విజయమ్మ.

సాయంత్రం ఏడు గుంటల వేళ వీధి గుమ్మంలో కూచుంది. కరెంటు పోయింది. ఎవరో ఏడుస్తున్న శబ్దం వినవచ్చింది. "ఎవరూ?" అంది.

నేను కుందుని! అన్నాడు వాడు వెక్కిళ్ల మధ్య.

విజయమ్మ గుండె దేవినట్లయ్యింది.

"కుందూ!" అంది వాడి తలని ఆప్యాయంగా నిమురుతూ

పరాశరం గారి నీడలో హాయిగా ఆనందంగా వుంటున్నాడు కుందు.

"ఆయన ఎలా పోయారు? ఏమిటి?" అని అడగాలనిపించ లేదు విజయమ్మకి.

ఆయన మహానుభావుడు, ఏ అమరలోకాలకో తరలిపోయాడు.

కుందు లాంటి వాళ్లకి కొండంత అండ ఆయన.

పరాశరంగారు లేరన్న నిజం ఆమె గుండెను పిండుతోంది.

ఇంక తను ఎవరితో కష్టసుఖాలు కలబోసుకుంటుంది?

"అమ్మగారూ వస్తాను! నన్ను మరచిపోకండి!"

"కుందూ అప్పుడప్పుడు వస్తూ వుండు!"

విజయమ్మ కళ్లు అవిరామంగా వర్షించాయి.

"వెర్రి నాగన్న!" అనుకుంది మనసులో.

కుందు ఏదో గుర్తు వచ్చిన వాడిలా వెనక్కి వచ్చాడు.

ఇంకా కరెంటు రాలేదు!

"అమ్మ గారూ, పరాశరం బాబుగారు ఇది మీకిమ్మన్నారు!" అంటూ ఓ వస్తువు ఆవిడ చేతిలో పెట్టి వడివడిగా అడుగులు వేసుకుంటూ చీకట్లో కలిసిపోయాడు.

ఏమై వుంటుంది?

ఒక్కసారి లైట్లు వెలిగాయి.

చేతిలోని వస్తువుకేసి చూసింది విజయమ్మ.

అది కళ్లజోడు! ■

## అమ్మ

తడారిపోయిన
గొంతుతో
ఎలా పిలిచినా
కమ్మగా
వినిపించే
తియ్యనిమాట
అమ్మ

– ఎం.నాగేశ్వరరావు